

# "మేలు కొలుపు"

చల్లపల్లి వెంకటేశ్వరరావు

"**మ**నం జీవితంలో జీవితంలో ఎన్నో పొరపాట్లు చేస్తుంటాము. కొన్ని తెలిసి చేసేవైతే.. మరొకొన్ని తెలియక చేసేవీ...! ఆనాలోచితంగా ఇతనికి ఓటేసి గెలిపించడం నేను చేసిన ఓ పెద్ద పొరపాటు...! మా ఎదురుగా సాగుతున్న ఎన్నికల ఊరేగింపుని చూస్తూ అన్నాను.

నా పక్కన నిల్చొని తాపీగా టీ తాగుతున్న వాసు, టీ తాగడం ఆపి చిర్నవ్వు నవ్వుతో, "అదే పొరపాటు నేను కూడా చాశా(న్రా... రామం!" అన్నాడు అతను కూడా ఊరేగింపుని చూస్తున్నాడు.

"బకాసురయ్య గారికీ... జై! భారత ప్రజల ఆశాజ్యోతి బకాసురయ్యా... జిందాబాద్... జిందాబాద్‌జజజ!" అంటూ ఊరేగింపులో వెనక సాగుతున్న అసుర(య్య) గణం గొంతుచించుకొని అరుస్తోంది.

టాపులేని జీపులో తన భారీ కాయాన్ని అతి కష్టం మీద నిలబెట్టి, చమటలు కక్కుకొంటున్నాడు... సదరు బక్కా అసురయ్య. మెడనిండా ఉన్న పూల దండల మధ్యలోంచి తాబేలులా తల బయటకు పెట్టి, రోడ్డు మీద కనపడ్డ వారందరికీ వినయంగా దండాలు పెడుతున్నాడతను.

ఎప్పుడూ వాహనాలతో రద్దీగా ఉంటే గంటస్థంభం జంక్షను, పెళ్లి నడకలు నడుస్తోంన్న ఆ ఊరేగింపు వలన, అక్కడ పేరుకు పోయిన వాహనాలతో కురుక్షేత్రంలాగ తయారయింది. ఇదేదీ పట్టన్నట్లు సాగుతున్న బకాసురయ్య, అక్కడ నిలబడ్డ మావంటి జనమంతా పనిగట్టుకొని అతనిని చూసేందుకే వచ్చి అక్కడ నిలబడ్డారన్నట్లు, ఠీవిగా చెయ్యి పైకెత్తి ఊపుతున్నాడు.

"ఒరే వాసూ...! ఇదివరకు మనం ఓటేసినపుడు ఇతను వేరే పార్టీలో ఉండేవాడు కదా...?" అనుమానంగా అడిగేను.

"అవును! పదవి లేని ప్రజాసేవ చాలా కష్టమని, పార్టీ మార్చేసి... ఆ తర్వాత మంత్రయిపోయాడు,..." అని జవాబిచ్చేడు వాసు.

నేను మౌనంగా ఉండిపోయేను.

మళ్లీ వాసే మొదలు పెట్టేడు, "ప్రజలు ఒక వ్యక్తిని తమకు నచ్చిన పార్టీ తరపున తమ ప్రతినిధిగా ఎన్నుకొన్నాక, అతను వారి అభిప్రాయానికి విలువీయకుండా తోసిపుచ్చి పార్టీలు మారుతున్నాడంటే... అతన్ని ఎన్నుకొన్న ప్రజల్ని అవహేళన చేస్తున్నట్లే... వారి ఓటుని కించపరిచినట్లే అవుతుంది... నా దృష్టిలో... !" అన్నాడు.

వాసుకి ఆవేశంపాటు కొంచెం ఎక్కువే... ఏ విషయం పైనైనా చాలా నిశితంగా... తొందరగా స్పందిస్తుంటాడు.

నేను ఏమీ అనకుండా వాడిని చూస్తున్నాను.

"మనం ఎన్నుకొనే వాడు దుర్మార్గుడు... అవినీతి పరుడు... అసమర్థుడూ అని తెలిసీ కూడా, మనలాంటి చదువుకున్న వాళ్లు సైతం ఎవరికో ఒకరికి లెమ్మని నిర్లిప్తంగా ఓటేసి వచ్చేస్తుంటాము. కానీ ఆ తర్వాత అతని వలన ఎంత కీడు జరగచ్చు...? అని ఎప్పుడూ, ఎవరూ ఆలోచించం...' ' తనలో తనే అనుకొంటున్నట్లుగా అన్నాడు వాసు.

"మరి అదే తప్పు నువ్వు కూడా చేశావని ఇపుడే కదా... అన్నావు...?" అని నేను చిన్న చురక వేశాను.

అందుకు వాసు, "నేను కూడా సగటు భారతీయుడ్నే కదా మరి... అందుకే ఈ నిర్లిప్తత... ఎవరికి ఓటేసినా ఫలితం ఒకటేనన్న నిర్లిప్తత...! అసలు ఏ రాజకీయ నాయకుడికైనా నిష్కళంక చరిత్ర అంటూ ఉందా...? సారా వ్యాపారాలు, హవాలా కేసులు, పోలీసు రికార్డులు... కుంభకోణాలు... ఇవే కదా నేతల నేపథ్యం...? ఎవరికి దొరికినంత వారు దేశాన్ని దోచుకొని తినేద్దామనే చూస్తుంటారు. అటువంటి వారిలో ఎవర్నో ఒకర్ని ఎన్నుకోమంటే ఎవరిని ఎన్నుకోవాలి... నేను? ఒక వేళ ఎన్నుకొన్నా ఆ గెలిచిన వాడికి వాడి పదవీకాలమంతా తన కుర్చీని కాపాడుకోవడానికే సరిపోతుంది. ఇంక దేశం గురించి ఆలోచించే సమయం ఎవరికుందీ...?" అన్నాడు కొంచెం ఆవేశపడుతూ!

"నిజమే ! దేశం గురించి ఆలోచించే తీరిక




ఎవరికుందిప్పుడు...? అలాగని రోజా టీవీల్లో, రేడియోల్లో దేశభక్తి గీతాలు పాడుకోవడం అశ్రద్ధ ఎప్పుడూ చూపం.

అంతేకాదు... మనం సాధించేసి పడేసిన ప్రగతిని భూతద్దం పెట్టుకొని, కంప్యూటర్ జిమ్మిక్కులతో కలగలుపుకొని టీవీల్లో రోజా చూసుకు మురిసిపోతుంటాము కూడా...!

చేదు వాస్తవాలని చూడాల్సొచ్చినపుడు మాత్రం గాంధారి దృక్కులు సారించి ఆత్మవంచన చేసుకొంటుంటాం.

దారిద్ర్యం... ఆకలి చావులు... నిరుద్యోగ సమస్య... నింగినంటే ధరలు... ఇదేనా మనం సాధించిన ప్రగతి...?

కరెంటు కొరత... తాగేనీళ్లకి కొరత... ఇంకా ఈ సమస్యల్ని పరిష్కరించగలిగే నిజాయితీ గల మనుషులకి కొరత... ఇదేనా మన పురోగతి...? దీనికంతటికి అసలు ఎవరు కారకులు?

ఆలోచించకుండా ఓటు వేసొచ్చే నావంటి వారిదా...? ఎవరిదీ బాధ్యత...?"

నేను దీర్ఘాలోచన్లోపడ్డం చూసి, "ఒరే రామం,! నువ్విలాగ ఇక్కడ యోగ సమాధిలోకి వెళ్లిపోతే నేను నీకు కాపలా కాస్తూ కూర్చోలేను కానీ... ఇంక పద... ఆలోచించింది చాలు...! అన్నాడు వాసు నా భుజంపై చెయ్యేస్తూ!

నేను చిన్నగా ఉలిక్కిపడి, "ఆఁ! పద..." అంటూ కదిలేను. ఇద్దరం మౌనంగా, పరధ్యానంగా దిక్కులు చూసుకుంటూ నడుస్తూ మూడు లాంతర్ల జంక్షను దగ్గిరకి చేరుకొన్నాము.

"సరే! ఇక వస్తాన్రా... కొంచెం పనుందీ...అప్లికేషన్ పోస్ట్ చెయ్యాలి..." అని చెప్పేసి వాసు వెళ్లిపోయేడు.

నేను కాసేపు అక్కడే నిలబడి, తర్వాత జేబులో చేతులుంచుకొని నెమ్మదిగా ఇంటివైపు అడుగు లేయ సాగాను.

\+ + +

"నిన్నట్నుంచీ వెంకయ్య పాలు తేవడం మానేశాడ్రా... రామం! ఓసారి వెళ్లి ఏమయిందో చూసి రాకూడదూ...?" అంది అమ్మ గెడ్డం గీసుకొంటున్న నా దగ్గరకొచ్చి!

"అలాగేలేవే... స్నానం చేసొచ్చి వెళ్తాను..." అన్నాను.

నేను తయారయ్యి, అమ్మిచ్చిన గిన్నె తీసుకొని పాలవాడింటికి బయలు దేరాను. అక్కడికి చేరుకొనేసరికి చీకటి చిక్కబడుతోంది. పశువుల పాక దగ్గిర డిమ్‌గా లైటు వెలుగుతోంది. నేను లోపలికి తొంగి చూశాను. లోపల వెంకయ్య పాలు తీయడానికి కూర్చొని ఉన్నాడు.

నన్ను చూసి, "అయ్యా! రామం బావుగారా...? నాను పాలట్టుకొద్దామనుకొంటుంటే మీరే వచ్చీశారా...? దీనమ్మా... ఈగేదె నిన్నట్నుండి పాలిడవడం నేదండయ్యా... దూడ సచ్చిపోనాదని...! ఎట్టాగో అవస్థ పడితే ఇదిగో... ఇపుడిపుడే ఇస్తోందయ్యా... కాసేపు తమరు బయట నిలబడితే పాలట్టుకు పోదురు గానయ్యా..." అంటూ మొత్తం కథంతా నేను అడగక ముందే చెప్పేశాడు వెంకయ్య.

నేను 'సరే'నన్నట్లు బుర్రూపి బయటకొచ్చి నిలబడ్డాను.

దూరంగా ఎక్కడో సభ జరుగుతున్నట్లుంది. గాలివాటం ఇటువైపే ఉండటం వలన, అక్కడి ఉపన్యాసాలు మైకులోంచి గాలిలో తేలుతూ వస్తూ స్పష్టంగా వినిపిస్తున్నాయి నాకు.

నేను చెవులు రిక్కించి విన్నాను. అది అసురయ్య గొంతులాగే ఉంది.

"...గాబట్టి సోదరసోదరీ మణుల్లారా...! నాను ఇంతకీ సెప్పొచ్చేదేటంటే... నాను లంచాలు మేసేవోడ్ననీ... మడ్డర్లు సేపించే వోణ్ణనీ... ఎన్నో కుంభ కోణాల్లో ఇరుక్కున్నోణ్ణనీ పత్రికలు సేస్తున్న తప్పుడు పెచారాన్ని మీరు నమ్మబాకండి... నాను నిఖార్సయిన పెద్ద మడిసి లాంటోడ్ని, అని మీ అందరికీ ఎరుకే..."

పశులుల పాకలోంచి ముక్కు పగిలిపోయేలా దుర్గంధం వెలువడుతుంటే భరించలేక, ముక్కుమూసు కున్నాను నేను.

".... అందువలన పెజలందరికీ... సవినయంగా నాను మనవి సేసుకొనేదేటిదంటే.. మీరంతా నిరుడు లాగే ఈసారి కూడా ఓటేసి నన్ను గెలిపించినారంటే నాను కుర్సీతో కూకుండిపోతానే... మఱ అందరికీ భూములేనోళ్లకి భూములు... ఇళ్లు లేనోళ్లకి ఇళ్లు ఇప్పించేత్తాను. అట్టాగే ఊరూరికి ఫేక్ట్రీలు తెరిపించేసి ఆటిలో మీ అందరికీ ఉజ్జోగాలు ఏపించేత్తాను.

నేను గేదెకి ఎదురుగా వేయబడిన గడ్డినీ, పాలు పిండుకొంటున్న వెంకయ్యని చూస్తున్నాను.

"... అంతేగాదు నా పియమైన పెజల్లారా...మీ ఊళ్లో రోడ్లేపించేత్తాను... ఆటి మీద దీపాలెట్టించేత్తాను. ఆస్పత్రులు కట్టించేతాను... మీకు బ్యాంకీలోను లిప్పించేత్తాను.

ఇయ్యనీ నానేమి మీకు కొత్తగా సెప్తున్నయి కావు. నేను సేసిన వాగ్దానాలు మరిసిపోయే మడిసిని కాను నేను సత్తెహరిచెందురుడు లాంటోడ్ని గాబట్టి పెజల్లారా... నాను మనవి సేసుకొనేదేటిదంటే,"

గలగల జలజలమని వానజల్లులా కురుస్తున్నాయి. అసురయ్య నోట వాగ్దానాలు ఆశల ఇంద్రధనుస్సుని నింగిలోంచి ఊడబెరికి, నేలమీద పరిచి చూపిస్తున్నాడతను. ఎదురుగా కన్పించే ఎండమావుల్లో నీరు తీయగా ఉంటుందని ఊరిస్తున్నాడు.

వేడి తగిలిన వెన్నలా కరిగి పోతున్నాయి ప్రజల హృదయాలు. అందుకు నిదర్శనంగా హోరుమంటున్నాయి చప్పట్లు.



**లోగుట్టు**

రామనాధాన్ని అడిగాడు పరమేశం.

"నువ్వు శీర్షాసనాలు వేయడం వలన మీ పని మనిషిని పనిలో నుండి గెంట వలసి వచ్చిందా? ఎలా?"

"టేబుల్, బీరువా, మంచం కింద ఆమె తోసేసిన చెత్తంతా నా కంటపడింది"

కె.వి.మధుసూదనరావు (కాకినాడ)

నేను దీక్షగా వింటున్నాను... మరింత దీక్షగా చూస్తున్నాను.

వెంకయ్య పాలు తీస్తోన్న గేదెకి ఎదురుగా గడ్డివేబడి ఉంది. కానీ దానినది తినడం లేదు. ఆ పక్కనే నిలబడున్న తన పెయ్యని ప్రేమగా నాలుకతో నాకుతోంది.

ఆపెయ్య తోకనిపైకెత్తి, సంతోషంగా చెంగు చెంగుమని దూకుతూ, మధ్యమధ్య తల్లి దగ్గరకొచ్చి గారాలుపోతూ... పాలుకుడిచేది... ఒకవేళ అదికాని బతికుండి ఉంటే...!

తల్లిప్రేమని అర్థం చేసుకోలేనట్లు నిర్జీవంగా నిలబడి చూస్తోంది ఆ ఛాటపెయ్య... శరీరమంతా తొలిచి గడ్డి కుక్కబడిన ఆ ఛాటపెయ్య!

మోసగింపబడుతున్న తల్లిని హెచ్చరించలేక నిస్సహాయంగా, నిశ్చేతనంగా నిలబడి జాలిగా తనకోసం పాలు విడుస్తున్న తల్లిని చూస్తుండి పోయింది.

కన్నప్రేమని వ్యక్తం చేసుకొనే భాష తనకి లేనందుకు బాధపడుతున్నట్లు, చెమర్చే కళ్లతో తన చిన్నారి చిట్టి పెయ్యని చూస్తూ... తనివి తీరా నాలుకతో నాకుతూ దాని శరీరం శుభ్రం చేస్తోంది ఆ మూగజీవి.

ఆ తమకంలో అప్రయత్నంగా ఏరులైపారుతున్న అమృత ధారల్ని పిండుకొంటున్నాడు వెంకయ్య.


నేను నా కళ్లని ఆ పశువుకీ, నా చెవుల్ని బకాసురయ్య ఉపన్యాసానికి అప్పగించేసి, నా మెదడును నా దగ్గరట్టే బెట్టుకొని ఆలోచించసాగేను.

ఒక మనిషి తన స్వలాభంకోసం సాటి మనుషుల్ని మభ్యపెట్టి మోసగిస్తున్నాడు.

"ఇంకో మనిషి నోరులేని పశువుని మభ్యపెట్టి మోసం చేస్తున్నాడు. మనిషి ఇంత నీచస్థాయికి దిగజారిపోయేడా...? మోసబోతున్న ఆ రెండు జాతులు ఒకే స్థాయిలో ఒకే స్థితిలో ఉన్నాయా ఇప్పుడూ...?" ఆలోచిస్తున్న కొద్దీ నా మనస్సు వికలమయిపోసాగింది. ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడలేనట్లు, "...బాబుగారో... బాబుగారు పాలు... " అంటున్న వెంకయ్య పిలుపుని పట్టించుకోకుండా గబగబా కదిలేను.

\+ + +

"ఏంటోనండమ్మా...? రామం బావుగారు నా మాటినిపింసుకోకుండా ఎల్లిపోనారూ..." అంటున్న వెంకయ్యతో "ఆ ! ఏదో గాలి సోకినట్లుందయ్యా వాడికీ ఒళ్లు కూడా కొంచెం వెచ్చబడింది... ఇప్పుడే దిష్టి తీసి పడేశాక నిద్రపోయాడు..." అంటున్న అమ్మ మాటలు లీలగా విన్పిస్తుంటే నిద్రలోకి జారుకోసాగేను నేను.




ఏదో గాలి సోకింది... ఏదో గాలి... నెమ్మదిగా నా రూపంలో మార్పులొస్తున్నాయి. మెల్లమెల్లగా చూస్తుండగానే నా రూపం పూర్తిగా మారిపోయి గేదెలాగ అయిపోయేను. అయ్యో! నేను... అయ్యో... అయ్యో... వాసు కూడా... తర్వాత ఊళ్లో జనమంతా... మారిపోతున్నారు గేదెల్లాగ... ఎవరూ మనుషులు మిగల్లేదు... ఊరంతా గేదెలే... అన్నీ తలలు వంచుకొని నడుస్తున్నాయి... మైదానం వైపు ఎవరో వాటిని తోలుతున్నారు వెనకనుండి... ఎవరూ అసురయ్యా... అవును అసురయ్యే...! మమ్మల్ని మైదానంలో బంధించేసి పాలు తీస్తున్నాడు.

ఆశ్చర్యం... పాలుకాదు... మా పొదుగుల నుండి ఓట్లు... ఓట్లు వస్తున్నాయి...

ఇంతలో దూరంగా... ఒక రాక్షసుడు... వాడు కూడా బకాసురుడిలాగే ఉన్నాడు... పేద్ద పొట్ట... మెడలో పూల దండలు... నోట్లో రక్తం కారుతున్న కోరలు తళ తళ మెరుస్తూ నెత్తిమీద కొమ్ములు... 'హ్హ... హ్హ...హ్హ...' అంటూ వికటాట్టహాసంతో మావైపే వస్తున్నాడు నావైపే చూస్తున్నాడు...

వాడి చేతిలో... మా పొదుగుల నుండి వెలువడిన ఓట్లు... గాలికి ఎగిరి పోతుంటే, అందుకొంటూ... ఆబగా రక్తం కారుతున్న నోట్లో కుక్కుకొని తింటున్నాడు...

అమ్మో... నాకు భయమేస్తోంది... గజగజా వణికిపోతూ తప్పించుకోవాలని గిజగిజలాడేను... కానీ కదల్లేక పోతున్నాను... నా మెళ్లో తాడుంది.... దాని మీద ఏవో అక్షరాలు... మీచేత ... మీ కొరకే... మీ వలనే... అని ఏమిటి ఈ తాడు మా కొరకా...? ఎందుకు...?

అమ్మా... రాక్షసుడొచ్చేస్తున్నాడు... అమ్మా ఏది అమ్మ... ? ఆ రాక్షసుడి చేతిలో ఉంది... అమ్మా విలవిలలాడుతోంది... మా అమ్మ... మువ్వన్నెల చీర కట్టుకొనుంది... దీనంగా చూస్తోంది... కాపాడుకోరా... మీ అమ్మని... వేడుకుంటోంది నన్ను కన్నతల్లి... అమ్మా... అమ్మా... అమ్మా...!

ఇంట్లో అందరూ నా అరుపులకి ఉల్లిపడి లేచిపోయేరు. అమ్మ గాబరాగా "ఏంట్రా... కన్నా... ఏమయిందమ్మా... ఏదైనా పీడకల వచ్చిందా...?' ' అంటూ నా వెన్ను మీద చెయ్యేసి నిమరసాగింది.

నేను గజగజ వణికిపోతూ గట్టిగా అమ్మ చెయ్యి పట్టుకొని చుట్టూ చేశాను. అపుడు తేరుకున్నాను.

"అవును పీడకలలే... ఇంక మెలకువగా ఉండాలి..."



## పెత్తనం

వంటింట్లో వంట చేస్తున్న భర్తతో అంది భార్య.

"మీకేమైనా... పాత్రలు కావాలంటే నన్నడగండి... అంతే గాని మీ ఇష్టానికి నా చీరలేసి పాత్రలు, అవీ కొంటే కుదరదు"

కె.వి.మధుసూదనరావు (కాకినాడ)